క్లుప్తంగా

నేడు చాకిరాలలో పౌరహక్కుల దినోత్సవం

నడిగూడెం: చాకిరాల గ్రామంలోని ఎస్సీ కాలనీలో మంగళవారం పౌరహక్కుల దినోత్సవం (సివిల్ రైట్స్ డే) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ టి.నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పాఠశాల అభివృద్ధికి కృషి

నడిగూడెం: గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని కాగిత రామచంద్రాపురం ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ గోసుల రాజేష్ అన్నారు. సోమవారం ఆ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాలకు స్వచ్ఛందంగా ఐదు ఫ్యాన్లను బహూకరించి మాట్లాడారు. అనంతరం దాత రాజేష్‌ను పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఇమామ్ పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్'కు అనుమతి ఇవ్వాలి

నడిగూడెం : తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర ముగింపు సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించే మహాసభకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని గ్రామ పంచాయతీ వర్కర్లు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్ ఇమామ్‌కు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ మల్లెల వెంకన్న, చిమట నాగరాజు, శ్రీకాంత్, సుభాని, సుధీర్, రామకృష్ణ, శ్రీను పాల్గొన్నారు.

రూ.25 వేల విరాళం

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయి మందిరంలో భోజనశాల నిర్మాణానికి సోమవారం చాకిరాలకు చెందిన రాంపల్లి వెంకటేశ్వర్లు గౌడ్, సుజాత, ఆయన కుమారుడు సతీష్‌గౌడ్, మమత దంపతులు రూ.25 వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మండవ వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి అనంతుల కృష్ణయ్య ఉన్నారు.

తహసీల్దార్‌ను నియమించాలి

హుజూర్‌నగర్: నియోజకవర్గ కేంద్రమైన హుజూర్‌నగర్‌కు తహసీల్దార్‌ను నియమించాలని మైనార్టీ నాయకులు అజీజ్‌పాషా సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఇన్‌చార్జి తహసీల్దార్ వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని పూర్తి స్థాయి తహసీల్దార్‌ను నియమించాలని విన్నవించారు.

మహాసభలను విజయవంతం చేయాలి

మఠంపల్లి : మార్చి 1, 2, 3వ తేదీల్లో మిర్యాలగూడలో నిర్వహించే తెలంగాణ రాష్ట్ర గిరిజన సంఘం మూడో మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మాలోతు బాలునాయక్ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని రఘునాథపాలెంలో మహాసభల పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర నాయకులు భూక్యాపాండునాయక్, రన్‌మియా, సీనునాయక్, పాపానాయక్, రామూనాయక్, జానూనాయక్, హరియా, లక్ష్మీబాయి, తరుణ్‌నాయక్, సేవానాయక్, హేమానాయక్, చిన్నానాయక్, పాల్గొన్నారు.

జయప్రదం చేయాలి..

గరిడేపల్లి: మిర్యాలగూడలోని ఈనెల 1న జరిగే తెలంగాణ గిరిజన రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్‌కె యాకుబ్ కోరారు. సోమవారం మండలంలోని చంద్రయ్యగూడెం తండాలో రాష్ట్ర మహాసభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. గిరిజనులకు 10శాతం రిజర్వేషన్ల ఆర్డినెన్స్ తెచ్చిన సీఎం కేసీఆర్ దాని ప్రకారం ఒక్క పోస్టు కూడా భర్తీ చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో బానోతు సూర్య, లకియా, మాల్య, అనిల్‌నాయక్, చిలకమ్మ ఉన్నారు.

'లిటిల్ స్కాలర్స్'లో వైజ్ఞానిక ప్రదర్శన

మేళ్లచెరువు: మండల కేంద్రం పరిధిలోని మైహోం సిమెంట్ పరిశ్రమలో గల లిటిల్ స్కాలర్స్ పాఠశాలలో సోమవారం విద్యార్థులు నిర్వహించిన సైన్స్‌ఫేర్ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ ఎగ్జిబిట్లను తయారు చేసి ప్రదర్శించి అలరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ జూపల్లి భార్గవి జ్యోతి, ప్లాంట్ హెడ్ శ్రీనివాసరావు, జీఎం నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయురాలు పావని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనులు ప్రారంభం

గరిడేపల్లి: మండలంలోని అప్పన్నపేట గ్రామంలో సోమవారం చేపట్టిన డ్రెయినేజీ పనులను సర్పంచ్యడవల్లి చంద్రారెడ్డి, ఎంపీటీసీ కడప ఇస్సాక్ ప్రారంభించి మాట్లాడారు. హెచ్‌డీఎఫ్ నిధుల నుంచి రూ.5లక్షలతో ఈ పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జలగం వెంకటేశ్వర్లు, నర్సిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, శంకర్, వెంకటయ్య, బిల్ కలెక్టర్ శ్రీనివాస్ ఉన్నారు.

ప్రతి ఫిర్యాదుపై స్పందించాలి

పాలకవీడు: స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించాలని సీఐ రామలింగారెడ్డి అన్నారు. సోమవారం ఆయన పాలకవీడు పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి మాట్లాడారు. సీసీ కెమెరాల ఏర్పాటుపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. హోలీ పండుగ పేరుతో రోడ్లపై రాళ్లు, కంపచెట్లు వేసినా అక్రమంగా చందాలు వసూలు చేసినా శాఖా పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్‌ఐ సిబ్బంది ఉన్నారు.

దర్జాలేని దర్జీలు..!

- విస్తరిస్తున్న రెడిమేడ్ రంగం
- దర్జీలకు ప్రభుత్వ ప్రోత్సాహం కరువు
- నేడు ప్రపంచ టైలర్స్ దినోత్సవం



మునగాలలో ఓ టైలర్ దుకాణంలో పనిచేస్తున్న దర్జీలు

మునగాల(కోదాడ): సమాజంలో సామాన్యుడు మొదలు అత్యున్నత స్థానం అలంకరించే అమాత్యులు, అధికారులు, సినీకళాకారుల వరకు దర్జీ వృత్తిదారులతో సంబంధాలు ముడిపడి ఉంటాయి. కానీ వారి నుంచి దర్జీలు ఆర్జించగలిగేది ప్రశంసలు మాత్రమే. దర్జీలకు వయస్సు మళ్లిన తర్వాత బతుకు బరువు కావడంతో పాటు సానుభూతి మాత్రం మిగులుతుందన్న ఆవేదన వ్యక్తం అవుతోంది. నేడు ప్రపంచ టైలర్స్ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

పాలకులు మారినా..

ప్రభుత్వాలెన్ని మారినా సరైన ప్రోత్సాహకాలు లేకపోవడంతో దర్జీల జీవితాలు దర్జాకు దూరం అవుతున్నాయి. ప్రత్యేకించి ప్రస్తుతం ఫ్యాషన్ రంగం విస్తరించడం, అందుకు దీటుగా రెడిమేడ్ షోరూంల ఏర్పాటుతో టైలర్స్ ఆర్థికాభివృద్ధికి దూరం అవుతున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో దాదాపు 2500కుటుంబాలు మాత్రమే టైలరింగ్ వృత్తిని నమ్ముకుని నెట్టుకొస్తున్నారు. నేడు అన్ని వయస్సుల వారికి రెడిమేడ్ దుస్తులు అందుబాటులోకి వచ్చాయి. ఫ్యాషన్ రంగం విస్తరించింది. టీషర్టులు, జీన్స్, షాట్‌లు రకరకాల దుస్తులు మార్కెట్‌లోకి వచ్చాయి. యువత ఆసక్తిని ఆదాయ వనరులుగా మార్చుకునేందుకు పెద్ద బ్రాండెడ్ కంపెనీలు నగరాలతో పాటు చిన్నచిన్న పట్టణాలు, గ్రామాల్లో సైతం ఇబ్బడిముబ్బడిగా వెలిశాయి. దీంతో సామాన్యుడు సైతం స్టైల్ పట్ల ఆకర్షితుడై రెడిమేడ్ వైపు మక్కువ చూపడంతో టైలరింగ్ దుకాణాల మెట్లు ఎక్కేవారు క్రమేణా తగ్గిపోతున్నారు.

మెటీరియల్ ధరల పెరుగుదలతో..

దుస్తుల తయారీకి సంబంధించిన మెటీరియల్ ధరలు పెరుగుదలకు అడ్డూఅదుపు లేకుండా ఉంది. టైలరింగ్ దుకాణాలను కూడా వ్యాపారాల సంస్థల కింద పరిగణించి విద్యుత్ చార్జీలు యూనిట్‌కు రూ.7కు పైబడి విద్యుత్ సంస్థ వసూలు చేస్తుంది. ప్యాంట్, షర్ట్ జత కుట్టుకూలి చెప్పుకునేందుకే రూ.600లు. అయినా అవి తయారు చేసేందుకు రూ.400లకు పైబడి ఖర్చు అవుతుంది. ఇక దుకాణం అద్దెలు, కరెంటు బిల్లులు చెల్లించిన తర్వాత మేస్త్రీలకు మిగిలేది ఏమీ లేదంటున్నారు.

టైలర్ల డిమాండ్లు ఇవీ..

టైలర్లు ప్రభుత్వ ఆదరణ కోసం ఎదురుచూస్తున్నారు. టైలర్లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి. నివాస స్థలాలతో పాటు ఇళ్లు నిర్మించుకునేందుకు నిధులు మంజూరు చేయాలి. చేనేతల మాదిరిగానే యాభై ఏళ్లకు పింఛన్లు, పిల్లల చదువులకు ఫీజుల చెల్లింపుల్లో రాయితీలు, టైలరింగ్ దుకాణాలకు విద్యుత్ చార్జీల విధింపులో రాయితీలు కల్పించాలని, ఆధునిక కుట్టుమిషన్లు కొనుగోలుకు బ్యాంకుల ద్వార రుణ సదుపాయం కల్పించాలని టైలర్లు కోరుతున్నారు.

టైలర్ల సంక్షేమానికి కృషిచేయాలి



ప్రభుత్వాలు టైలరింగ్ రంగాలపై ఆధారపడి జీవి స్తున్న కార్మికుల సంక్షేమానికి కృషిచేయాలి. అర్హులైన పేద వారికి ఇళ్ల పట్టాలు అందించి ఆదుకోవాలి. ప్రత్యేకించి బ్యాంకు రుణాలు అందిస్తే టైలరింగ్ రంగం రాబోయే రోజుల్లో కొంత మెరుగ్గా ఉంటుంది. ఏళ్ల తరబడి ఇదే వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నప్పటికీ సమస్య వచ్చినప్పుడు సంక్షేమ పథకాలేవి లేకపోవడం బాధాకరం.

– షేక్ జానిమియా, టైలరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు, మునగాల

40ఏళ్లుగా ఇదే వృత్తిలో కొనసాగుతున్నా..



నలభైఏళ్లుగా ఇదే వృత్తిలో కొనసాగుతున్నా. ప్రస్తుతం రెడిమేడ్ రంగం మార్కెట్ పోటీలో తాము తట్టుకోలేకపోతున్నాం. మా ఇబ్బందులు అంతా ఇంతా కావు. బతకలేక బడిపంతులు అనే నానుడి మాకు వర్తిస్తుంది. ఏళ్ల తరబడి మా కుటుంబాలను ఇలానే నెట్టుకొస్తున్నాం.

– నాగుల ప్రవీణ్, మునగాల

ప్రభుత్వం రుణాలు అందించి ఆదుకోవాలి



బతకలేక దర్జీ వృత్తిలో కొనసాగుతున్న మాలాంటి కార్మికులకు ప్రభుత్వం రుణాలు అందచేసి ఆదుకోవాలి. మార్కెట్‌లో అత్యాధునిక కట్టుమిషన్లు వస్తున్నాయి. వాటిని కొనుగోలు చేసేందుకు టైలర్లకు ఆర్థిక స్థోమత లేదు. 50ఏళ్లు దాటిన టైలర్లకు నెల నెల రెండువేల రూపాయల పింఛన్ అందచేయాలి.

– ఏలే శ్రీనివాస్, మునగాల

బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్



కల్యాణలక్ష్మి చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

చిలుకూరు: బీఆర్‌ఎస్ హయాంలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని బేతవోలు, చిలుకూరు, జెర్రిపోతుల గూడెం గ్రామాల్లో ఇంటింటికి తిరిగి లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన కూడా చేశారు. ఈ సందర్భంగా తమ ఇళ్లకు వచ్చిన ఎమ్మెల్యేకు లబ్ధిదారులు ఘన స్వాగతం పలికారు. తమ ఇళ్లవద్దకే వచ్చి చెక్కులు అందజేయడంతో వారు ఆనందం వ్యక్తం చేశారు. చిలుకూరులో కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించి కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలోనే అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కొడారు బాబు, నలబోలు సుజాత శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీలు బెల్లంకొండ రమణ నాగయ్య, వడ్డేపల్లి కళ్యాణ కోటేష్, రైతు సమన్వ సమితి మండల అధ్యక్షుడు దొడ్డా సురేష్‌బాబు, సొసైటీ చైర్మన్లు అలసకాని జనార్దన్, బాషం సైదులు, వైస్ చైర్మన్ అక్కినపల్లి జానకీరామాచారీ, మాజీ ఎంపీపీలు బజ్జూరి వెంకట్‌రెడ్డి, కొండా అన్నపూర్ణ, డీఎల్‌డీఏ డైరెక్టర్ కస్తూరి నర్సయ్య, మాజీ జెడ్పీటీసీ భట్టు శివాజీ నాయక్, తాళ్లూరి శ్రీనివాస్, తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీడీఓ ఈదయ్య, ఆర్‌ఐలు సీతయ్య, మంజుల, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



మునగాలలో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం, ప్రజాసంఘాల నాయకులు

మునగాల: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఖండిస్తూ సోమవారం మండల కేంద్రంలోని గణపవరం క్రాస్ రోడ్డులో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాసంఘాల నాయకులు కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల ప్రధానమంత్రి మోదీ ఆధ్వర్యంలో బడ్జెట్–2023 పూర్తిగా కార్మిక, కర్షకులకు వ్యతిరేకంగా ఉందని ఆరోపించారు. ఏప్రిల్ 5న చేపట్టిన పార్లమెంట్ ముట్టడికి దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది కార్మికులు, కర్షకలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి చందా చంద్రయ్య, మండల కార్యదర్శి వర్గ సభ్యులు షేక్ సైదా, బచ్చలకూర స్వరాజ్యం, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నందిగామ సైదులు, డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు గడ్డం వినోద్, గ్రామశాఖ కార్యదర్శి కిన్నెర వెంకన్న పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా పనిచేయాలి

- ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

పాలకవీడు: అధికారులు రాజకీయాలకు అతీతంగా పనిచేయాలని, మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎంపీపీ భూక్యా గోపాల్ అధ్యక్షతన నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా బొత్తలపాలెం సర్పంచ్ విద్యుత్, భగీరథ నీటి సరఫరాలో సమస్యలను ప్రస్తావించారు. పది నెలలు గడుస్తున్నా ఉపాధిహామీ కూలీలకు వేతనాలు చెల్లించడంలేదని సభ దృష్టికి తీసుకువచ్చారు. యల్లాపురం గ్రామంలో ఎస్సీ కాలనీపై లెవన్‌కేవీ విద్యుత్ లైన్ తొలగించాలని ఎన్నిసార్లు విన్న వించినా విద్యుత్ అధికారులు పట్టించుకోవడంలేదని ఎంపీటీసీ వెంకటయ్య సభ దృష్టికి తెచ్చారు. పాలకవీడు ఎంపీటీసీ ఉపేందర్ మాట్లాడుతూ ఎంపీటీసీలకు నిధులు, విధులు లేవని ఇలాంటి పదవులు ఎందుకని అలాంటి మండల పరిషత్ వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎంపీ ఉత్తమ్ మాట్లాడుతూ ఉపాధి కూలీలకు వేతనాల్లో జాప్యం నిధులు మంజూరు, ధరణిలో ఏర్పడిన సమస్యలు, మహిళా సంఘాలకు అభయహస్తం నిధులు, విద్యుత్ సమస్యలు వంటి పలు సమస్యలను ఆయాశాఖల కమిషనర్‌లతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చాడు. వ్యవసాయం, పశువైద్యం, ఐకేపీ, అంగన్‌వాడీ, వైద్యం, పంచాయతీరాజ్, నీటిపారుదలశాఖల అధికారులు తమతమ నివేదికలో చదివి వినిపించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ వెంకటాచారి, తహసీల్దార్ శ్రీదేవి, జెడ్పీటీసీ మాళుతు బుజ్జి మోతీలాల్, ఎంపీఓ దయాకర్, వైస్ ఎంపీపీ ఉపేందర్ పాల్గొన్నారు.

పర్యటనను విజయవంతం చేయాలి

నడిగూడెం : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావుఠాక్రే కోదాడ నియోజకవర్గంలో చేపట్టే రెండు రోజుల పర్యటనను విజయవంతం చేయాలని ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోరారు.సోమవారం మండల పరిధిలోని రామాపురంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను కార్యకర్తలు ఇంటింటికీ తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బూతుకూరి వెంకటరెడ్డి, నాయకులు గుండు శ్రీను, ఏపూరి సుధీర్, మొక్క భిక్షపతి, సతీష్, నీలిమా గాంధీ, రవి, శ్రీను, సోమయ్య పాల్గొన్నారు.

దేశ సమగ్రత, సమైక్యత కోసమే జోడో యాత్ర

మునగాల : దేశ సమగ్రత, సమైక్యత కోసమే రాహుల్ గాంధీ జోడో యాత్ర చేస్తున్నారని ఎంపీ ఎస్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశంలో మాట్లాడారు. రాహుల్ గాంధీ జోడో యాత్ర స్ఫూర్తితో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రే చేపడుతున్న పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట నాయకులు మండల పార్టీ నాయకులు కొలిశెట్టి బుచ్చి పాపయ్య, ఉప్పుల జానకిరెడ్డి, మండవ చంద్రయ్య ఉన్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిన ప్రభుత్వం

నడిగూడెం : ప్రజలకు ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం విస్మరించిందని బీజేపీ కోదాడ అసెంబ్లీ కన్వీనర్ కనగాల నారాయణ ఆరోపించారు. సోమవారం మండల పరిధిలోని శ్రీరంగాపురంలో నిర్వహించిన 'ప్రజాగోస–బీజేపీ భరోసా' కార్నర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు దున్నా సతీష్, నాయకులు ఎస్‌.కె.లతీఫ్, వంగవీటి శ్రీనివాసరావు, పరబ్రహ్మాచారి, బండారు శోభారాణి, కాసాని సైదులు, బండారు రవి పాల్గొన్నారు.

వెంకటరాజు మృతి తీరనిలోటు



నివాళులర్పిస్తున్న రంగారెడ్డి తదితరులు

హుజూర్‌నగర్ రూరల్: సీపీఎం సీనియర్ బొల్లేపల్లి వెంకటరాజు మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. మండలంలోని శ్రీనివాసపురంలో సోమవారం మృతి చెందిన వెంకటరాజు భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.ప్రభాకర్, బసవ పున్నయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు నాగారపు పాండు, జిల్లా కమిటీ సభ్యులు పల్లె వెంకటరెడ్డి, సైదులు పాల్గొన్నారు.

బీజేపీ అధికారంలోకి వస్తే పేదలకు సమన్యాయం



నేరేడుచర్ల : మాట్లాడుతున్న బొబ్బా భాగ్యారెడ్డి

నేరేడుచర్ల : రానున్న ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులైన పేదలందరికీ సమన్యాయం చేస్తామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కల్లూరు, దాసాం గ్రామాల్లో నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ శక్తి కేంద్రాల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాగానే ఉచిత విద్య, వైద్యంతో పాటు అర్హులైన పేదలందరికీ పక్కా గృహాలు, రైతులకు ఫసల్ బీమా యోజన, ఆయుష్మాన్ భారత్ ద్వారా ఉచిత వైద్యం అందిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం ద్వారా లక్షల కోట్ల రూపాయలు వెచ్చించినా ప్రజలకు నీళ్ల కొనుగోలు చేసే దుస్థితి ఏర్పడిందన్నారు.కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పోకల వెంకటేశ్వర్లు, నియోజకవర్గ కో ఆర్డినేటర్ అంబళ్ల నరేష్ గౌడ్, శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్ పల్లెపంగ వీరబాబు, ప్రవీణ్, వెంకన్న, సుధాకర్ తదితరులున్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మునగాల : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యురాలు నూనె సులోచన కోరారు. సోమవారం మండలంలోని 47,48, 49,50 బూత్ నంబర్లకు సంబంధించి వెంకట్రాంపురంలో శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ ఎడ్ల సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు భద్రంరాజు కృష్ణప్రసాద్, ప్రధాన కార్యదర్శి వేముల వీరబాబు, నాయకులు దొంగరి సత్యనారాయణ, మైలార్‌శెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శక్తి కేంద్రం మీటింగ్

కోదాడఅర్బన్ : పట్టణంలోని భవానీనగర్‌లో బీజేపీ కోదాడ పట్టణ శక్తి కేంద్ర కార్నకార్నర్ మీటింగ్ 186, 187 బూతుల్లో శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ దుగ్గి వెంకటేశ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కిరాజు యశ్వంత్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బొలిశెట్టి కృష్ణయ్యలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షుడు ఓరుగంటి రంగారావు, శక్తి కేంద్ర కోఆర్డినేటర్ సాతులూరి హనుమంతరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఓరుగంటి పురుషోత్తం, మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు కోటకొమ్ముల భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

మఠంపల్లి : ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వంలోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని ఆ పార్టీ జిలాల నాయకులు బానోతు రంగానాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన మఠంపల్లిలో ఆ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్ట్రీట కార్నర్ మీటింగ్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈసమావేశంలో బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు పత్తిపాటి విజయ్, వీరబాబు, భాస్కర్‌గౌడ్, వీరయ్య, సురేందర్, రామకృష్ణ తదితరులున్నారు.

అధికారులు తీరు మార్చుకోవాలి

నేరేడుచర్ల : గ్రామీణ ప్రాంతాల్లో మిషన్ భగీరథ పథకంలో అన్ని సమస్యలే ఉన్నాయని, అధికారుల తీరు మార్చుకోవాలని ఎంపీపీ లకుమళ్ల జ్యోతి, జెడ్పీటీసీ రాపోలు నర్సయ్యలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం వేసవి కాలం సమీపిస్తున్నందున స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వెంకట్‌రెడ్డి వైస్ ఎంపీపీ తాళ్లూరి లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ శంకరయ్య, మిషన్ భగీరథ ఏఈ శ్రీనాథ్‌లతో పాటు సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులున్నారు.

పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలి

నేరేడుచర్ల: నేరేడుచర్ల మున్సిపాలిటీలోని ప్రభుత్వ భూముల్లో పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ సరితకు బీఎస్పీ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఇళ్లు లేకుండా పేదలు ఇబ్బందులు పడుతున్నారని, వారందరికీ ప్రభుత్వ భూముల్లోలో డబుల్ బెడ్ ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. ఈకార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు వాసా కరుణాకర్, హుస్సేన్, గోపి, అక్రం, ఖరీముల్లా, మౌలాంభి, రమాదేవి తదితరులు ఉన్నారు.

అనురాగ్ కళాశాలలో టాస్క్ శిక్షణా తరగతులు

అనంతగిరి : స్థానిక అనురాగ్ ఫార్మసీ కళాశాలలో ఫైనల్ ఇయర్ విద్యార్థులకు టాస్క్(తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్) ఆధ్వర్యంలో సాఫ్ట్ స్కిల్స్‌పై శిక్షణ తరగతులను సోమవారం టాస్క్ ప్రతినిధి హరీశ్ ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. చిన్న ఈశ్వరయ్య తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ తరగతుల లో సృజనాత్మక నైపుణ్యం, ఇంటర్వ్యూ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్ నైపుణ్యాల వంటి అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణా తరగతులను కళాశాల టీపీఓ విద్యాసాగర్ పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



కంటివెలుగు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ

మఠంపల్లి : ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కంటివెలుగు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ముడావత్‌పార్వతి అన్నారు. సోమవారం మండలంలోని గుర్రంబోడుతండాలో ఏర్పాటుచేసిన కంటివెలుగు కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పార్వతీనాయక్, ఎంపీడీఓ జానకిరాములు, ఎంపీఓ ఆంజనేయులు, వైద్యసిబ్బంది తదితరులున్నారు.

మౌలిక సదుపాయాలు ఏర్పాటు

కోదాడఅర్బన్ : పట్టణంలోని బస్టాండ్‌లో కనీస మౌలిక సదుపాయాలు ప్రయాణికుల సౌకర్యార్థం కల్పించినట్లు, కోదాడ ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీహర్ష తెలిపారు. బస్టాండ్‌లోపల, ఆవరణలో కోదాడ మున్సిపాలిటీ సహకారంతో పిచ్చిమొక్కలను తొలగించి పరిశుభ్రమైన వాతావరణం తీసుకొచ్చినట్లు తెలిపారు. అదే విధంగా త్వరలో దాతల సహకారంతో పిల్లలకు పాలిచ్చు గదిని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఉచితంగా మురుగు దొడ్లును, మూత్రశాలలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సదుపాయాలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎవరూ బహిరంగ మల మూత్ర విసర్జన చేయకుండా బస్టాండ్ పరిశుభ్రంగా ఉంచాలని ఆయన ప్రయాణికులకు విజ్ఞప్తి చేశారు.

స్టార్టర్ల తొలగింపు నిలిపివేయాలి

మునగాల : వ్యవసాయ మోటార్లకు ఆటోమేటిక్ స్టార్టర్ల తొలగింపును వెంటనే నిలిపివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బుర్రి శ్రీరాములు, జిల్లా కార్యవర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని కలకోవలో నిర్వహించిన ఆ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులకు 24గంటల విద్యుత్ సరఫరా చేస్తామని చెప్పి రైతులను మోసం చేశారని ఆరోపించారు. ఈ సమావేశానికి అనంత్ గుర్వయ్య అధ్యక్షత వహించగా, ఆ పార్టీ మండల కార్యదర్శి చందా చంద్రయ్య, నాయకులు బచ్చలకూరి స్వరాజ్యం, డి.స్టాలిన్‌రెడ్డి, వెంకటాద్రి, బి.కృష్ణారెడ్డి, నందిగామ సైదులు, కొంపెల్లి లింగయ్య, వెంకట కోటమ్మ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నుంచి కాపాడుకుందాం



మాట్లాడుతున్న ఇందూరి సాగర్

మోతె : దేశంలో, రాష్ట్రంలో యువతను మాదకద్రవ్యాల భారీ నుండి కాపాడుకుందామని ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇందూరి సాగర్ అన్నారు. సోమవారం మండల పరిధిలో రావిపహాడ్ గ్రామంలో నిర్వహించిన పీవైఎల్ మండల మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అంతకముందు పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు నాగయ్య ఎర్రజెండా ఆవిష్కరించారు. అనంతరం సాగర్ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో యువత మద్యం, గంజాయి, గుట్కా, మాదకద్రవ్యాలకు అలవాటుపడి తమ విలువైన ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని నిషేధించడంలో విఫలంచెందాయన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులకు మాయమాటలు చెప్పి నిరోద్యుగుల ఉసురు పోసుకుంటుందన్నారు. కోడి లింగరాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ మహాసభలో ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంట నాగయ, కనుకుంట్ల సైదులు, ఏఐకెఎంఎస్ జిల్లా నాయకులు కాకి మోహన్‌రెడ్డి, కోట మధుసూదన్‌రెడ్డి, ఎర్రబోయిన లింగయ్య, శ్రీకాంత్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థిని ప్రీతి మృతికి సంతాపం



గరిడేపల్లి : వెలిదండలోని సంతాపం తెలుపుతున్న ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు

గరిడేపల్లి: వైద్య విద్యార్థిని ప్రీతి మృతి పట్ల సోమవారం మండలంలోని వెలిదండ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజనం సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీ.సత్యనారాయణ, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రణబోతు రవీందర్, గిరిజన ఉపాధ్యాయ సంఘం నాయకురాలు రమావత్ చంద్రకళ పాల్గొన్నారు.

నడిగూడెం : పీజీ మెడికల్ విద్యార్థి ప్రీతి మృతి పట్ల సోమవారం కరివిరాల మోడల్ స్కూల్‌లో సంతాపం తెలిపారు. ఆమె చిత్ర పటానికి పూల మాలలు వేసి, కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు.

పాఠశాలలు బంద్

మెడికల్ కళాశాల పీజీ విద్యార్థి ప్రీతి మృతికి కారణమైన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సేవాలాల్ సేన ఆధ్వర్యంలో మండలంలోని తెల్లబల్లి, ఎకలాస్‌ఖాన్‌పేట గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలను బంద్ చేశారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

హుజూర్‌నగర్ : మెడికో ప్రీతి ఆత్మహత్యకు కారకుల అయిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విన్నపం ఒక పోరాటం వ్యవస్థాపక అధ్యక్షురాలు చీకూరి లీలావతి కోరారు. సోమవారం హుజూర్‌నగర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

విచారణ జరిపించాలి

వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కాలేజీ వైద్య విద్యార్థి ప్రీతి ఆత్మహత్య కేసులో నిందితుడైన సైఫ్‌ని కఠినంగా శిక్షించాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పి విజయ్ డిమాండ్ చేశారు. సోమవారం హుజూర్‌నగర్‌లో ఆయన మాట్లాడారు.

ప్రీతి కుటుంబానికి న్యాయం చేయాలి

మెడికల్ విద్యార్థిని ప్రీతి మృతిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించి ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి చందర్‌రావు, టీజేఎస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వి లక్ష్మీ, యువజన సంఘం జిల్లా అధ్యక్షులు భిక్షం డిమాండ్ చేశారు. వైద్య విద్యార్థి మతి పట్ల హుజూర్‌నగర్‌లో సోమవారం కొవ్వొత్తులతో నివాళులర్పించారు.

ఉపాధ్యాయుల నిరసన

మోతె : మండల పరిధిలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల ఉర్లుగొండలో సోమవారం పాఠశాల ఉపాధ్యాయులు మెడికల్ విద్యార్థిని ప్రీతి మృతి పట్ల నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు ఇక ముందు పునరావృతం కాకుండా ప్రభుత్వ విద్యా సంస్థల్లో కఠిన చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

ఎన్‌సీడీ మందుల కిట్ పంపిణీ

కోదాడ రూరల్ : మండల పరిధిలోని కాపుగల్లులో సోమవారం వైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అసంక్రమిత వ్యాధులకు (మధుమేహం, అధిక రక్తపోటు) సంబంధించిన ఎన్‌సీడీ మందుల కిట్‌లను ఎంపీపీ చింత కవిత పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఈఓ సాంబశివరావు, సూపర్‌వైజర్ సిద్దమ్మ, వైద్య సిబ్బంది విజయ్, కృష్ణ, ఇందిర, రూపరాణి పాల్గొన్నారు.

క్షతగాత్రుడికి ఆర్థికసాయం

నేరేడుచర్ల : మేడారం గ్రామానికి చెందిన యడవల్లి సాయి రోడ్డు ప్రమాదం గాయపడి మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా సోమవారం ఓజో ఫౌండేషన్ చైర్మన్ పిల్లుట్ల రఘు పంపించిన రూ.10 వేల ఆర్థికసాయాన్ని ఆ సంస్థ ఇన్‌చార్జి కుక్కల వెంకన్న అందజేశారు.

నిఘా నేత్రం చూసేదెలా?

చిలుకూరు మండల కేంద్రంలో సీసీ కెమెరా ఉన్నా లేనట్టుగానే ఉంది. నిఘా కోసం స్థానిక సెంటర్‌లో స్తంభానికి ఏర్పాటు చేసిన సీసీ కెమెరా చుట్టూ వివిధ పార్టీల జెండా తోరణాలు కట్టడంతో అది కనిపించడం లేదు. ఫలితంగా రోడ్డుపై ఏమి జరిగిన అందులో రికార్డు అవ్వని పరిస్థితి నెలకొంది. తక్షణమే పోలీసులు స్పందించి సీసీ కెమెరాల చుట్టూ ఉన్న జెండా తోరణాలను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– చిలుకూరు



చిలుకూరు బస్టాండ్ సెంటర్‌లో సీసీ కెమెరాను మూసి వేసిన పార్టీ జెండాలు